క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణ ఘట్టంలో కళాకారులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కాచన్‌పల్లి గ్రామంలో ఈ నెల 25న చిరుతల రామయణం ప్రారంభం కాగా, గురువారం సీతారాముల కల్యాణ మహోత్సవం ఘట్టం వైభవంగా నిర్వహించారు. గంగారం, సుద్దాల, దుగ్నెపల్లి, నారాయణపూర్, రాయిపేట గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బిల్కగూడెంను సందర్శించిన అధికారులు

• సమస్యల పరిష్కారానికి హామీ



గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ జీపీ పరిధిలోని బిల్కగూడెంలో సమస్యలపై ఈ నెల 25న 'సాక్షి'లో 'బిల్కగూడెం–అభివృద్ధికి దూరం' అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ఎంపీడీవో ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అస్మిత గురువారం బిల్కగూడెంను సందర్శించి గిరిజనులతో మాట్లాడారు. గూడెం మొత్తానికి ఒక్కటే చేతి పంపు ఉండటంతో, నీటి కోసం ఇబ్బంది కాకుండా వీలైతే భగీరథ నీళ్లు వచ్చేలా, లేదంటే పాడై పోయిన మరో చేతిపంపును వినియోగంలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

పాక్కూర్‌లో కార్డన్ సెర్చ్



బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు గ్రామంలో చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో గురువారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 50ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నాటుసారా స్థావరాలను గుర్తించి 500లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 6 లీటర్ల నాటుసారా, 30కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎస్సైలు సుబ్బారావు, వెంకటేశ్వర్‌రావు, పోలీసు సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతు



ట్రాక్టర్‌తో రోడ్డును చదును చేయిస్తూ...

వేమనపల్లి: నీల్వాయి–ముల్లంపేట ప్రధాన రహదారిపై గుంతలతో ఐదు కిలోమీటర్ల దూరం అధ్వానంగా ఉండగా, మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్ కుమార్ గురువారం తన సొంత ఖర్చులతో మొరం పోసి మరమ్మతు చేయించారు. రోడ్డు మరమ్మతు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, నాయకులు పరిశీలించారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం



శరత్ బాబును సన్మానిస్తున్న కళాకారులు

మంచిర్యాలఅర్బన్: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య–హైదరాబాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన సమావేశంలో గురువారం తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జానపాటి శరత్‌బాబును శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య డీఎస్ మూర్తి పాల్గొని మాట్లాడారు. అంతరించి పోతున్న నాటక, లలిత కళలకు పూర్వవైభవం తీసుకురావాలన్నారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సమీకృతం.. స్థలమెక్కడా?

• బెల్లంపల్లి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ గురుకులం మంజూరు
• ఏర్పాటుకు 25–30ఎకరాల స్థలం అవసరం
• సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు
• మరో వారం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక..!



ప్రతిపాదిత సింగరేణి భూమి

సమీకృత గురుకుల విద్యాలయం స్వరూపం
గురుకుల విద్యాలయానికి కావాల్సిన భూమి – 25–30ఎకరాలు
నిర్మాణ వ్యయం – రూ.200కోట్లు
తరగతుల ప్రవేశం– 5నుంచి ఇంటర్ వరకు
ఒక్కోసామాజిక వర్గం విద్యార్థుల అడ్మిషన్ సంఖ్య – 640మంది
అడ్మిషన్ కల్పించే మొత్తం విద్యార్థుల సంఖ్య – 2,560

బెల్లంపల్లి: రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయాలను' ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక హంగులతో గురుకుల సముదాయం నిర్మించి ఉత్తమ విద్యాబోధన అందించాలని సంకల్పించింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడతలో 55అసెంబ్లీ నియోజకవర్గాలను ఎంపిక చేయగా, అందులో బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఒకటి కావడం గమనార్హం. బెల్లంపల్లిలో వారం రోజుల నుంచి స్థలాన్వేషణ ప్రక్రియ కొనసాగుతుండగా, అనువైన స్థలం కోసం రెవెన్యూ అధికారులు తలమునకలవుతున్నారు. ఒకే చోట గరిష్ఠంగా 25–30ఎకరాలు కలిగిన వివాదరహిత ప్రభుత్వ స్థలం కోసం సర్వే పనులు జరుగుతున్నాయి. బెల్లంపల్లి మండలం బుధాకలాన్ శివారు సర్వే నంబర్ 170లో ప్రభుత్వ భూములు ఉన్నాయి. బెల్లంపల్లి చుట్టూరా విస్తరించి ఉన్న ప్రభుత్వ భూములు చాలా మట్టుకు అన్యాక్రాంతం కాగా, ప్రస్తుతం కొద్దిపాటి ఎకరాల భూమి మాత్రమే మిగిలి ఉంది. ఈ క్రమంలో సమీకృత గురుకుల విద్యాలయం కోసం అవసరమైన భూమిని గుర్తించే ప్రక్రియ అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారింది. ఇప్పటివరకు నిర్దిష్టమైన స్థల ఎంపిక జరగకపోగా, మరో వారం రోజుల వ్యవధిలో తుది నిర్ణయం తీసుకొని ప్రభుత్వానికి నివేదిక పంపించాలనే తలంపులో అధికారులు ఉన్నారు.

స్థలాల పరిశీలన ఇలా ...

• బెల్లంపల్లి పరిసరాల్లో పలు చోట్ల ప్రభుత్వ స్థలాలను గుర్తించి ప్రాథమికంగా సర్వే చేశారు.
• బెల్లంపల్లి నుంచి తాళ్లగురిజాల గ్రామానికి వెళ్లే మార్గంలో టీజీఆర్‌ఎస్ ముందు ఉన్న ఐటీడీఏకు చెందిన భూమిని సర్వే చేశారు. దాదాపు 30ఎకరాల వరకు ఖాళీ భూమి ఉన్నట్లు తేల్చారు.
• బెల్లంపల్లి నుంచి తాండూర్‌కు వెళ్లే మార్గంలో నేషనల్ హైవే పక్కన ప్రభుత్వానికి స్వాధీనం చేసిన మూసివేతకు గురైన 44డీప్ మైన్‌కు చెందిన భూమి కొలతలు చేశారు. ఈ ప్రాంతంలో కూడా దాదాపు 25ఎకరాలకు పైగా ఖాళీ భూమి ఉన్నట్లు గుర్తించారు.
• ఈ రెండు చోట్ల కాకుండా మరో రెండు మూడు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను గుర్తించడానికి యత్నాలు జరుగుతున్నాయి.

సర్వే జరుగుతోంది



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మాణం కోసం అనువైన ప్రాంతాల్లో భూ సర్వే జరుగుతోంది. ఇప్పటి వరకు రెండు మూడు చోట్ల సర్వే చేశాం. మరి కొన్ని ప్రాంతాల్లోనూ ప్రభుత్వ భూములను గుర్తించడానికి సర్వే చేస్తాం. ఎలాంటి వివాదం లేకుండా ఉన్న భూములను ఎంపిక చేసి, ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం.

యు.జ్యోత్స్న, తహసీల్దార్, బెల్లంపల్లి

ఆ భూములు సాధ్యం కాకపోతే..

సమీకృత గురుకుల విద్యాలయం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ భూములతో పాటు సింగరేణి భూములను సైతం పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా బెల్లంపల్లి నడి బొడ్డులో ఎత్తివేతకు గురైన స్టోర్, వర్క్‌షాప్‌కు చెందిన భూములు పడావుగా ఉన్నాయి. ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసు హెడ్ క్వార్టర్ ముందు ప్రస్తుతం సింగరేణి సోలార్ పవర్ కోసం భూమి చదును చేసింది. మిగితా చోట్ల కన్న అక్కడ ఉన్న భూమి ఎంతో అనువైనదిగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయా చోట్ల ఉన్న భూములు సింగరేణి ఆధీనంలో ఉన్నాయి. సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి 30ఎకరాల వరకు తీసుకోవాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఈ రెండు చోట్లలో ఏదో ఒకటి ఖరారు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

కష్టపడ్డారు.. కొలువుకొట్టారు

• 'అగ్నివీర్'కు ఐదుగురు ఎంపిక • అందరిది వ్యవసాయ కుటుంబమే..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ పరీక్షల్లో ఉత్తీర్ణులై హాజీపూర్ మండలానికి చెందిన ఐదుగురు యువకులు ఆర్మీకి ఎంపికయ్యారు. జై కిసాన్.. జై జవాన్ అన్న మాటలు నిజం చేస్తూ మండలం నుంచి ఎంపికైన వారంతా కూడా వ్యవసాయ కుటుంబం నుంచి ఎన్నికైనవారే ఉన్నారు.

గర్వంగా ఉంది..



మాది వ్యవసాయ కుటుంబం. అమ్మనాన్న సత్తమ్మ–లచ్చయ్య ఇద్దరూ పొలం పనులకు వెళ్తారు. అలాంటి కుటుంబం నుంచి నేను దేశ రక్షణలో భాగస్వామ్యం అవుతున్నందుకు గర్వంగా ఉంది. మొదటి ప్రయత్నంలోనే సైనికుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– గూడెల్లి రాజేందర్, దొనబండ

చాలా సంతోషం..



సైనికుడిగా దేశసేవలో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉంది. అమ్మనాన్న రచన–సత్తయ్య వ్యవసాయం చేస్తూ చదివించారు. దేశభక్తితోనే మొదటి సారిగా అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకొని జనరల్ డ్యూటీ విభాగంలో ఎంపికయ్యాను.

– కోట రాంచందర్, దొనబండ

ఉత్సాహంగా ఉంది..



వ్యవసాయ కుటుంబం నుంచి దేశ సైనికుడిగా ఎంపికైనందుకు చాలా ఉత్సాహంగా ఉంది. అమ్మనాన్న పద్మ–సత్తయ్యలు ఇద్దరూ కూడా వ్యవసాయం చేస్తూ ఉంటారు. రెండో ప్రయత్నంలో అగ్నివీర్ ద్వారా సైనికుడిగా ఎంపికవ్వడం తృప్తిగా ఉంది.

– సంగాణవేణి సాత్విక్, గొల్లపల్లి

ధైర్యంగా ముందుకు..



దేశసేవలో ధైర్యంగా ముందుకు సాగుతా. అమ్మనాన్నలు పద్మ–వెంకటేశం వ్యవసాయం చేస్తూ నాతో పాటు ఇద్దరు అక్కలను చదివిస్తున్నారు. డిగ్రీ చేసి అగ్నివీర్‌కు దరఖాస్తు చేయగా రాత, ఈవెంట్, మెడికల్ విభాగాల్లో రాణించడంతో ఎంపికయ్యాను.

– సొంబారి అజయ్, నర్సింగాపూర్

మొదటి ప్రయత్నంలోనే ఎంపిక

మాది హాజీపూర్ మండలం గొల్లపల్లి గ్రామం. అగ్నివీర్‌కు దరఖాస్తు చేయగా చేసిన మొదటి ప్రయత్నంలోనే ఇండియన్ ఆర్మీకి ఎంపికయ్యాను. మాది వ్యవసాయ కుటుంబం కాగా తల్లిదండ్రులు చంద్రకళ–చంద్రయ్య వ్యవసాయం చేస్తారు. దేశసేవలో భాగస్వామ్యం అవుతున్నందుకు ఆనందంగా ఉంది.

– జక్కుల రమేశ్, గొల్లపల్లి

సిర్సాలో బోరు పంచాయితీ

కోటపల్లి: మండలంలోని సిర్సా గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే స్పందించి బోరు మంజూరు చేశారు. ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్యలో వేయాల్సిన బోరును అధికార పార్టీ బడా నాయకుడికి అనుకూలంగా ఉండే ఒకరిద్దరి ఇళ్లు ఉండే ప్రదేశంలో బోరు వేయడంతో కాలనీవాసులు గురువారం తీవ్ర ఆందోళన చేపట్టారు. ఎంపీడీవో లక్ష్మయ్యను వివరణ కోరగా బోరు వేసేందుకు స్థలం ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో, సమస్య ఎదురైందన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

జైపూర్: మండలంలోని శెట్‌పల్లి, నర్సింగాపూర్, ఇందారం గ్రామాల్లో మండల స్థాయి భూ పరిష్కార కమిటీ అధికారులు గురువారం క్షేత్ర స్థాయిలో భూములు పరిశీలించారు. తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్సై శ్రీధర్ మోకాపై భూములను పరిశీలించి బాధితుల రికార్డులు చూశారు. మొదటి దరఖాస్తు వివాదాస్పదంగా ఉండి కోర్టులో ఉండడంతో ఉత్తర్వులు వచ్చే వరకు సంయమనం పాటించాలని తెలిపారు. రెండో దరఖాస్తు అసైన్డ్ భూమి 2020– 21లో ఇతరుల పేరు మీద నమోదైందని తదుపరి చర్యలకు కలెక్టర్‌కు సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

భీమిని: మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని జెడ్పీ సీఈవో గణపతి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రికార్డులను తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో గంగామోహన్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఏఐ బోధన ప్రారంభం

భీమిని/జన్నారం/దండేపల్లి: విద్యార్థులకు ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)తో బోధన సులభతరం అవుతుందని కన్నెపల్లి, జన్నారం, దండేపల్లి ఎంఈవోలు రాము, విజయ్‌కుమార్, చిన్నయ్య అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని జన్కాపూర్ ఎంపీపీఎస్‌లో, జన్నారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పొన్కల్, జన్నారం, కొత్తపేట బీ విద్యార్థులకు, దండేపల్లి మండలంలోని వెల్గనూర్, గుడిరేవు ప్రాథమిక పాఠశాలల్లో గురువారం ఏఐ ల్యాబ్‌లను ప్రారంభించారు.

సద్వినియోగం చేసుకోండి

మంచిర్యాలటౌన్: క్రైస్తవ, ముస్లిం మైనారిటీ సామాజిక వర్గాల యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ దరఖాస్తును కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పనివేళల్లో సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9989165891, 8886737682 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

తోళ్ల పరిశ్రమ స్థల హద్దులపై రభస

మందమర్రిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన గతంలో తోళ్ల పరిశ్రమకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని సింగరేణికి సంబంధించిన సోలార్ కాంట్రాక్టర్ కబ్జా చేసి సోలార్ ప్లేట్ పాతినట్లు ప్రజా సంఘాల నాయకులు ఏరియా జీఎంకు ఫిర్యాదు చేశారు. సింగరేణి ఏరియా ఎస్టేట్ ఆఫీసర్ నవనీత గురువారం సర్వే సిబ్బందితో అక్కడకు చేరుకొని ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో లెదర్ ఇండస్ట్రీస్ పార్క్ అధ్యక్షులు విజయ్‌కుమార్, సదానందం, సుద్దాల జనార్దన్, తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి

నెన్నెల/జన్నారం/తాండూర్: నకిలీ విత్తనాలు, నిషేధిత కలుపు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, జన్నారం తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ హెచ్చరించారు. పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గురువారం జన్నారం, నెన్నెల, తాండూర్ మండలాల్లో ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. ఎరువుల విక్రయదారులు, డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. డీలర్లు తప్పనిసరిగా పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతుకు రశీదులు ఇవ్వాలని తెలియజేశారు. కార్యక్రమాల్లో నెన్నెలలో ఏవో సృజన, డీటీ ప్రకాష్, ఎస్సై ప్రసాద్, నాయకులు హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, జన్నారంలో ఏవో సంగీత, ఏఎస్సై బిక్కులాల్, ఆర్‌ఐ భానుచందర్, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

నేడు నకిలీ పత్తి విత్తనాలపై అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట రైతువేదికలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నకిలీ పత్తి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత ఆర్థోపెడిక్ మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్‌లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆస్పత్రి వైద్యులు సీఆర్ హరీష్, చైతన్య, రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. కార్యక్రమంలో సిరిపురం రాజేష్, వెంకటేశ్వర్లు, బాలమోహన్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

వర్క్‌షాప్‌లో సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదాలు గురువారం కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం డీజీఎంను కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కొనసాగుతున్న గైర్హాజరు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో గైర్హాజరు జాబితాలో ఉన్న కార్మికులకు కంపెనీ చేపట్టిన కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. మూడో రోజు గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కౌన్సెలింగ్ కార్యక్రమానికి జీఎం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏరియా ఎస్‌ఓటు జీ ఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల కోసం నిరీక్షణ

నెన్నెల: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు కుల ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవా కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారు. తహసీల్దార్ సెలవుపై వెళ్లడంతో వారం రోజులుగా ధ్రువపత్రాల జారీలో జాప్యం జరుగుతోంది. కార్యాలయంలో ఇప్పటివరకు 600కు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. గడువు తేదీ సమీపిస్తుండడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. డీటీకి బాధ్యతలు అప్పగించి ధ్రువపత్రాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు కూరగాయల మార్కెట్ బంద్

మంచిర్యాలటౌన్: కూరగాయల వ్యాపారి కొత్త రాజ్యలక్ష్మి మృతికి సంతాపంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ బంద్ ఉంటుందని కూరగాయల మార్కెట్ అధ్యక్ష, కార్యదర్శులు తోట సత్యనారాయణ, చింతపండు శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇసుక లారీలు క్రమపద్ధతిలో నిలుపుకోవాలి

కోటపల్లి: 63వ జాతీయ రహదారిపై గురువారం ఇసుక లారీలు ఇష్టారీతిన నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇసుక క్వారీలను సందర్శించి ఇసుక లారీలను జాతీయ రహదారిపై క్రమపద్ధతిలో నిలుపుకోవాలని, ఇతరులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ రాఘవేందర్‌రావు, సీఐ సుధాకర్ క్వారీ యజమానులను, లారీ డ్రైవర్లను ఆదేశించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కాసిపేట: రాష్ట్ర అసెంబ్లీలో గోర్‌బోలి బంజారా భాష ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీర్మానం చేసి ఆమోదం తెలపడంతో గురువారం మండలంలోని సోమగూడెం (కె) తండావాసులు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

తాండూర్ గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

తాండూర్: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని గురువారం గ్రంథాలయ కార్యదర్శి సరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయ రికార్డులను నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

వయోజన విద్యపై అవగాహన

కాసిపేట: మండలాన్ని వందశాతం అక్షరాస్యత సాధనకు ఎంపిక చేయడం అభినందనీయమని, విద్యార్థులు భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ తెలిపారు. మండలంలోని ధర్మరావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు వయోజన విద్యపై అవగాహన కల్పించారు.

కూలీలకు నీటి సౌకర్యం కల్పించాలి

వేమనపల్లి: ఉపాధిహామీ పనిస్థలాల వద్ద కూలీలకు తాగునీటి వసతి కల్పించాలని ఎంపీడీవో కుమారస్వామి అన్నారు. మండలంలోని గొర్లపల్లి గ్రామపంచాయతీలో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న నీటి కుంట పనులను పరిశీలించి మస్టర్లు వెరిఫై చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పాతమంచిర్యాల: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని నస్పూర్‌లో పనిచేస్తున్న మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్టు వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం, ప్రధాన కార్యదర్శి కొండ్ర లింగయ్య డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో కార్మికశాఖ అధికారి కార్యాలయంలో గురువారం వినతిపత్రం సమర్పించారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేత

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణ లక్ష్మి చెక్కులను బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ బుధాకుర్దు గ్రామానికి చెందిన అచ్చ శ్రీవిద్య, సారం.సంధ్యారాణిలకు గురువారం పంపిణీ చేశారు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు

భీమారం: మండల కేంద్రంలో మూడు రోజుల పాటు శ్రీరామచంద్రమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా శిక్షణ తరగతులు బుధవారం రాత్రి ముగిశాయి. సంస్థ ట్రైనర్ పర్శ శ్రీనివాస్ మాట్లాడుతూ.. యోగా ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నట్లు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెకు సిద్ధంకండి

నస్పూర్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు కార్మికవర్గం సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు పిలుపునిచ్చారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలన్నారు.

ముందస్తు అరెస్ట్

వేమనపల్లి: పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమానికి వెళ్తుండగా గురువారం మండల మాజీ సర్పంచ్‌లను నీల్వాయి పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో మండల మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మధుకర్, రాజలింగు, మొండి ఉన్నారు.

వైద్యుడికి సన్మానం

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు క్రాంతికుమార్ ఇటీవల కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. దీంతో అతన్ని నేతకాని మహార్ సంక్షేమ సంఘం నాయకులు రాజమల్లు, ఇసాకర్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు.

'అదనంగా డబ్బుల వసూలు చేయొద్దు'

మందమర్రిరూరల్: మండలంలోని మీ సేవా కేంద్రాల నిర్వాహకులతో గురువారం తహసీల్దార్ సతీష్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి ప్రభుత్వం నిర్దేశించిన రుసుం మాత్రమే తీసుకోవాలని, అధికంగా వసూలు చేయొద్దని వారికి సూచించారు.

రెయిన్ గేజ్ సిస్టం పరిశీలన

వేమనపల్లి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెయిన్‌గేజ్ సిస్టంను డెప్యూటీ ఎస్‌వో ఏ.ఆర్.కె.మూర్తి, తహసీల్దార్ రమేష్ గురువారం పరిశీలించారు. వర్షమాపకం కొలతలు తీసుకునే విధానం, నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు.

సండ్రల్‌పహడ్‌లో శ్రమదానం

కాసిపేట: మండలంలోని సండ్రల్‌పహడ్ గ్రామంలో యువత, గ్రామ పెద్దలు గురువారం శ్రమదానం నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి చెట్లు, ముళ్ల పొదలు తొలగించారు. కార్యక్రమంలో రత్నం ప్రదీప్, కాల్వ మల్లేష్, దాడి గట్టయ్య, చంద్రమౌళి, యువకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్‌కు చెందిన ఒడ్డె సత్తయ్యకు గురువారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఎల్‌వోసీ అందజేశారు.

చెలిమె నీరు తాగొద్దు

సాక్షి ఎఫెక్ట్..



మామిడిగూడలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

భీమిని: మండలంలోని వడాల, మామిడిగూడ గ్రామాల్లో నీటికి ఇబ్బంది పడుతుండగా 'చెలిమె–చేతిపంపు దిక్కు' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. వడాల గ్రామాన్ని బుధవారం సందర్శించగా, మామిడిగూడ గ్రామాన్ని అధికారులు గురువారం సందర్శించారు. ఎంపీడీవో గంగామోహన్, మిషన్ భగీరథ ఏఈ పోషం, పంచాయతీ కార్యదర్శితో కలిసి మామిడిగూడ గ్రామానికి వెళ్లి మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పైపులైన్లు పరిశీలించి, లీకేజీ అయిన పైపులకు మరమ్మతు చేయించారు. శుక్రవారం నుంచి శుద్ధి చేయబడ్డ మిషన్ భగీరథ తాగు నీరు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. చెలిమె నీటిని తాగొద్దని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.